నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్

మంగళవారం 7 నవంబర్ 2023
TUESDAY, NOVEMBER 7, 2023

MANCHERIAL
KUMURAM BHEEM ASIFABAD

పేజీలు : 12
PAGES



మందమర్రిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ బాల్క సుమన్, నాయకులు

# వివేక్‌కు డిపాజిట్ రాకుండా ఓడిస్తాం

- ఈ ప్రాంతం నుంచి వెళ్లగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తాం
- కనీసం ఓటరు లిస్టులో పేరు లేని వ్యక్తికి టికెట్ ఎలా ఇచ్చారు?
- ఏఐసీసీ చెప్పేదొకటి.. చేసేదొకటా?
- సీట్లన్నీ ఒకే ఇంట్లో ఇస్తే.. మిగతా దళితులు ఎక్కడికి పోవాలి?
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి నచ్చకే రాజీనామా
- బీఆర్ఎస్‌లో చేరుతా.. కారును గెలిపిస్తా..
- మంచిర్యాల ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి బోడ జనార్దన్

..2లో



రాజీనామా లేఖను చూపిస్తున్న మాజీ మంత్రి బోడ జనార్దన్

**"చెన్నూర్ కాంగ్రెస్ టికెట్** కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నాం. పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి గెలిచే వారికే టికెట్ ఇస్తామని చెప్పాడు. కానీ.. ఇప్పుడు కనీసం ఓటరు లిస్టులో పేరులేని గడ్డం వివేక్‌కు ఇచ్చారు. ఒకే కుటుంబంలో రెండు పదవులు ఇవ్వద్దని, కనీసం రెండేళ్లు కాంగ్రెస్‌లో పనిచేసిన వారికే సీటు కేటాయిస్తామని చెప్పిన ఏఐసీసీ మాట తప్పింది. అన్నకేమో బెల్లంపల్లి, తమ్ముడికేమో చెన్నూర్, కొడుక్కేమో పెద్దపల్లి ఎంపీ సీటు.. ఇట్లా ఒకే ఇంట్లో అందరికీ ప్రాధాన్యమిస్తే మిగతా దళితులంతా ఎక్కడికి పోవాలి. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి నచ్చకే ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నా. త్వరలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతాం. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తాం.'' అని మాజీ మంత్రి బోడ జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలోని తన నివాసంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. *- మంచిర్యాల, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*





మందమర్రిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక

# కార్మిక క్షేత్రానికి కేసీఆర్

## నేడు చెన్నూర్ నియోజకవర్గంలో 'ప్రజా ఆశీర్వాద సభ'

- రేపు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి సెగ్మెంట్లలో పర్యటన
- మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాట్లు
- గులాబీ మయమైన సభా ప్రాంగణం చుట్టు పక్కల ప్రాంతాలు
- నియోజకవర్గాల నలుమూలల నుంచి భారీగా జన సమీకరణ

-2లో..

**నల్ల సూర్యుల ఆశాకిరణం,** సింగరేణి ప్రగతి ప్రదాత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(మంగళవారం) చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, విప్ బాల్క సుమన్‌కు మద్దతుగా కార్మిక క్షేత్రమైన మందమర్రిలో నిర్వహించే 'ప్రజా ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించనున్నారు. మంచిర్యాల జిల్లాలో జరిగే తొలి సభ కావడంతో సుమన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని జన సమీకరణ చేస్తున్నారు. జనాన్ని తరలించడానికి 800 ప్రత్యేక బస్సులు, ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేశారు. దాదాపు 50 వేలకుపైగా జనాన్ని తరలించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. బుధవారం కూడా సీఎం కేసీఆర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

*- మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

..7లో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# కాంగ్రెస్ ఖతం

**సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్‌రెడ్డి రాజీనామా**

- కంటతడి పెట్టిన ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు
- రేవంత్ వెట్టిచాకిరీ చేయించుకుని నమ్మక ద్రోహం చేశాడు..
- అధిష్ఠానానికి బుద్ధి చెబుతాం : కాంగ్రెస్ సీనియర్లు
- రెబల్‌గా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మేనల్లుడు సంజీవ్‌రెడ్డి పోటీ

..2లో

**ఆదిలాబాద్ జిల్లాలో** కాంగ్రెస్ ఖతం అయింది. టికెట్ల పంచాయతీ రాజీనామాలకు దారి తీసింది. హస్తం అధిష్ఠానం సీనియర్లను కాదని కంది శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించడంతో పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మేనల్లుడు, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి, వివిధ విభాగాల నాయకులు పార్టీ సభ్యత్వానికి, తమ పదవులకు రాజీనామాలు చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ఇంట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. టికెట్ ఇస్తామంటూ ఐదేండ్లుగా వెట్టిచాకిరీ చేయించుకున్న కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నమ్మక ద్రోహం చేశారని మండిపడ్డారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కంటతడి పెట్టారు. కార్యకర్తల సూచనల మేరకు కాంగ్రెస్ రెబల్‌గా సంజీవ్‌రెడ్డిని పోటీలో నిలుపాలని నాయకులు నిర్ణయించారు. *- ఆదిలాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ)*

# మూడో రోజు ఏడు..

## ఆసిఫాబాద్ జిల్లాలో ఒకటి, మంచిర్యాల జిల్లాలో 6 నామినేషన్లు దాఖలు

**ఆసిఫాబాద్ జిల్లాలో** ఒకటి, మంచిర్యాల జిల్లాలో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం మూడో రోజు పలు పార్టీల అభ్యర్థులు సంబంధిత పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని వారు తెలిపారు.